

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 72 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 11, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# ఓటరు మహాశయ.. ఎటువైపు !



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



- నేడే మున్సిపల్ ఎన్నికల తొలి పోరు
- ఓట్ల కోసం కరుకు నోట్లు?
- పైసా పంపకాల్లో పరుగెత్తుతున్న పార్టీలు
- ఒక్క ఓటుకు ఆరు నుండి ఎనిమిది వేలు పంచుతున్నారు ?
- ప్రత్యక్ష రాజకీయాల్లో డబ్బు పంచకుంటే గెలుపు లేదు
- అన్ని పార్టీల దగ్గర డబ్బులు తీసుకుంటున్న ఓటర్లు
- పైసా ప్రభావమే రాజకీయ ప్రభావం
- అభివృద్ధి గెలుస్తుందా అత్యాశ గెలుస్తుందా
- రాజకీయ లబ్ది కోసం అన్ని పార్టీల నానా తిప్పలు పడుతున్నాయి
- కొన్నిచోట్ల ప్రభుత్వ అధికారులే పలుకుబడి చూపుతున్నారు
- ఓట్లకు పైసలు పంచుతున్నారు పన్నుల రూపంలో దండుకుంటున్నారు
- పైసలు పంచుతున్న నాయకులది తప్పా... డబ్బులు తీసుకుంటున్న ఓటర్లు తప్పా
- డాక్టర్ బరిగెల శివ





**హైదరాబాద్, (జై బీమ్ డెస్క్) :**

రాజకీయ నాయకుల విజ్ఞత ఎన్నికలప్పుడే బయటపడుతుందని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. అన్ని పార్టీల దగ్గర పార్టీల నాయకుల దగ్గర డబ్బులు తీసుకుంటున్న ఓటర్లు ఒకే ఒక్క ఓటు వేయడానికి అవకాశం ఉన్నప్పుడు అన్ని పార్టీల దగ్గర డబ్బులు తీసుకోవడం ఎంత మోసం ఓటర్ మహాశయులు గుండెల మీద చేయి వేసుకొని ఆలోచించుకోవాలన్నారు. పుక్యానికి వస్తుందని ఫినాయిల్ తాగడానికి కూడా వెనుకాడని రోజుల్లో జీవిస్తుండడం ఎంతటి సిగ్గుమాలినతనంగా మారిపోయిందో అర్థం చేసుకోవాలన్నారు. డబ్బులు పంచుతున్న నాయకులు ఆ డబ్బులు ఎక్కడి నుండి వచ్చాయో ఎలా వచ్చాయో ఏమాత్రం తెలియకుండానే పదుల సంఖ్యలో వందల సంఖ్యలో రాజకీయ నాయకులు ఒక్కసారిగా గల్లీలో చేరిపోయి గడపగడపకు డబ్బులు పంచుతూ ఓటర్ల లిస్టులలో గల ఓటర్లను ప్రలోభాల గురి చేస్తూ ఒట్లు దండుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారన్నారన్నారు. ప్రజల విశ్వాసాన్ని ప్రజల ఓట్లను రాబట్టుకోవడానికి రాజకీయ విశ్వాసాన్ని కనపరిచే రోజుల్లో నుంచి డబ్బు పంచితే తప్ప గెలవలేమనే భయాందోళన పరిస్థితుల్లోనికి రాజకీయాలు దిగజారాయని వాటన్నిటికీ ప్రధాన కారణం రాజకీయ నాయకులకు ప్రజాసేవపై విశ్వాసం లేకపోవడమే కారణమన్నారు. ప్రభుత్వం తరఫున ప్రతిపక్షం తరపున ఇతర పార్టీల తరఫున పోటీలో నిలుస్తున్న నాయకులందరూ ప్రజల విశ్వాసాన్ని

- మిగతా 2లో..

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు..

కేంద్రం నుంచి కీలక ప్రకటన

బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి

ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి



2

## కొండాపూర్‌లో హైడ్రా కొరడా.. రూ.700 కోట్ల విలువైన భూమికి రక్షణ

జంగమోని కుంటను మాయం చేసిన కబ్జాదారుల యత్నం భగ్నం

4 ఎకరాల చెరువును చదును చేసి ప్లాట్లుగా మార్చేందుకు యత్నం

కబ్జాదారులపై కేసులు నమోదు చేసిన రెవెన్యూ అధికారులు

చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న హైడ్రా

5



## విశాఖ వాసులకు గుడ్ న్యూస్..

7

మెట్రో రైలు ప్రాజెక్టుకు పచ్చజెండా.. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్

పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ ప్రతిపాదన

## లాభాల హ్యాట్రిక్: వరుసగా మూడో రోజూ లాభాల్లో మార్కెట్లు

వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు

208 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 67 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ

కొన్ని కంపెనీల మెరుగైన క్యూ3 ఫలితాలతో మార్కెట్లకు మద్దతు

ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభం

డాలర్‌తో పోలిస్తే బలపడిన భారత రూపాయి

5





## జీవోలతో జీవితాలకు నష్టం

ప్రభుత్వ జీవోలు జర్నలిస్టులకు మేలు చేకూర్చేలా లేవు.

జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు కల్పించినప్పుడే ప్రభుత్వానికి విలువ.

కేబుల్ ఛానల్ యాజమాన్యాన్ని అంతం చేసే కుట్రలు.

ప్రజా పాలనలో ప్రజల ఆత్మ గౌరవ గొంతుకలకు కళ్లెం వేస్తున్నారు.

కేబుల్ రంగం రక్షణకు 252 జీవో పునఃసమీక్షించాలి.

ఐ అండ్ పిఆర్ జాయింట్ డైరెక్టర్‌కు కేబుల్ ఓనర్స్ జేఏసీ వినతిపత్రం

6

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఓటర్ "మహాశయ" ఎటువైపు

మొదటి పేజీ తరువాయి

పొందుకోవడం కోసం ప్రజలు బలపరిస్తే గెలుస్తామనే దీమతో ఎన్నికల్లో నిలబడుతున్నప్పుడు లెక్కలేనంత సొమ్మును ఖర్చు చేయడం నిజాయితీ కలిగిన రాజకీయం ఎలా అవుతుందని నిలదీశారు.ఒకవైపు ప్రజలు, ఓటర్లు డబ్బులు ఇస్తేనే ఓట్లు వేస్తామని మొండిపట్టుతో ఉంటుండగా మేమేం తక్కువ కాదంటూ రాజకీయ నాయకులు ఇంటింటికి పైసలు పంచుకుంటూ రాజకీయ ఎన్నికల పోటీలను రణరంగంగా మారుస్తూ ప్రజాస్వామ్యంలో ప్రత్యక్ష రాజకీయాలంటే ఇలాగే ఉంటాయి ఏమోనని ప్రజలకు ఓటర్లకు కొత్త ఒరవడిని అలవాట్లు చేస్తున్నారన్నారు.గతంలో ఓటుకు 50 రూపాయల నుండి 100 రూపాయలు పంచుతే మహా గగనం అనుకునే రోజుల నుండి ప్రస్తుతం ఐదు నుంచి పదివేల రూపాయల వరకు పంచేస్తాయికి రాజకీయ ఓట్ల రూపాన్ని మారుస్తూ సాదారన రాజకీయ నాయకులకు ప్రత్యక్ష రాజకీయాలను, ప్రజాస్వామ్య రాజకీయాలను దూరం చేస్తున్నారన్నారు.రిజర్వేషన్లతో ఒక్కసారిగా బగ్గుమన్న రాజకీయ కక్షలు ప్రతి నియోజకవర్గంలో అనుకూలమైన వ్యక్తుల కోసం ప్రత్యేక రిజర్వేషన్లను అన్ రిజర్వ్ జనరల్ స్థానాలను ఏర్పాటు చేసుకొని రాజకీయ శాసనాలను ఒక వర్గాల వైపు నెట్టుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.రిజర్వేషన్లు మినహాయిస్తే మిగిలిన అన్ని స్థానాలలో ఎక్కువ శాతం అగ్రవర్ణాలకే అవకాశాలు దక్కుతున్నాయన్నారు.ప్రజలు ఓట్లు వేసే ముందు ఆలోచించుకుంటూ జాగ్రత్తగా గమనిస్తూ నాయకులను ఎన్నుకో వలసిన పరిస్థితుల నుండి ఎంతటి అన్యాయపరులైనా ఎంతటి అసమర్థత పరులైన ఎంతటి సోమరులైన ఎంతటి అవినీతిపరులనా ఏంతటి అక్రమార్కులైన ఎంతటి భూకబ్జాదారులైన ఎంతటి మోసగాళ్ళైనా పర్వాలేదు అధికార పార్టీలో ఉంటే చాలు గెలుస్తామనే దీమా ప్రతి రాజకీయ నాయకునికి ధైర్యాన్ని కల్పిస్తుంది అన్నారు.ప్రభుత్వాధికారులైన పోలీస్ అధికారులులు రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు ఆయా ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రజలు ఓట్లు వేయడానికి అన్ని రకాల సౌకర్యాలను అన్ని రకాల ఏర్పాట్లను అన్ని రకాల రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తూ జవాబుదారితనాన్ని ప్రదర్శిస్తూవుంటుండగా ఓట్లు వేయడానికి వస్తున్న ప్రజలు డబ్బులు తీసుకుని ఓట్లు వేస్తూ అవినీతికి పాల్పడుతుండగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ నాయకులు ప్రజలకు ఓట్లు పంచి ప్రతి బూతు చుట్టూ తిరుగుతూ రాజకీయ గెలుపును పరీక్షించుకోవడం వింతగా అనిపిస్తుందన్నారు. ఇదంతా రాజకీయ క్రీడలో బాగమని నమ్మిస్తున్నప్పుడు అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఎన్నికల నిర్వహించి ఏం ప్రయోజనమన్నారు.ప్రజలు ఓటర్లు రాజకీయ నాయకులను మోసగిస్తున్నారా,అదే క్రమంలో రాజకీయ నాయకులు ప్రజలను ఓటర్లను మోసగిస్తున్నారా తెలియకుండా పోతున్నప్పటికిని ప్రజాస్వామ్యంలో గౌరవం పోగొట్టుకుంటున్నది మాత్రం ఎన్నికల నిర్వహిస్తున్న అధికారులేనని ఇటు ఓటర్లు అటు నాయకులు ప్రదర్శిస్తున్న అక్రమ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలు స్పష్టం చేస్తున్నాయన్నారు.ఒకవైపు ప్రభుత్వం అధికారులను అప్రమంతంగా ఉండాలని ఆదేశిస్తూనే కింది స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని తప్పుదారి పట్టించే విధంగా పక్కా ప్రణాళికలతో ప్రజలకు డబ్బులు పంచి ఓటర్లను మోసగిస్తుండడం అంతే ఉత్సాహంతో ఓటర్లు సిగ్గుమాలినతనాన్ని ప్రదర్శిస్తూ అన్ని పార్టీల దగ్గర డబ్బులు తీసుకుంటూ ఒక్క నాయకునికి మాత్రమే ఓటు వేయడం శునకం వాంతిని తిరిగి నాకినట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు.అదే సందర్భంలో రాజకీయ నాయకులను ప్రజలకు సేవ చేయమని ఏ విధంగా అడుగుతారు అంటూ సూటిగా నిలదీశారు.ఓటర్లు నిజాయితీగా ఉన్నప్పుడే ప్రజలు నిజాయితీగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోగలుగుతామంటూ తెలుపుతూ రాజకీయ నాయకులకు నిజాయితీలు నేర్పించే స్థాయిలో ఓటర్లు ప్రభావితం చూపాలన్నారు.ఇంటింటికి డబ్బులు పంచాలని ఆశ కలిగిన రాజకీయ నాయకులు అన్ని ప్రాంతాల్లో తిరుగుతున్న సందర్భంలో ఓట్ల కోసం డబ్బులు పంచే ప్రక్రియ ప్రారంభమవుతున్న ప్రతి సందర్భంలో ఓటర్లు రాజకీయ నాయకులు పంచుతున్న డబ్బులను తిరస్కరిస్తూ నిజాయితీని కనపరుస్తూ రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు.అలాంటప్పుడే ప్రజలంటే, ఓటర్లంటే రాజకీయ నాయకులకు ఎక్కడ లేని భయం ఏర్పడుతుందన్నారు.మనల్ని మనం కాపాడుకోవాలన్న మన భవిష్యత్ తరాలను రక్షించుకోవాలన్న రాజకీయ నాయకులు పంచుతున్న డబ్బులను తిరస్కరించాల్సిందేనని స్పష్టం చేశారు.ఓటర్ మహాశయులారా రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగాలి అంటూ సూచించారు.మనం మారకపోతే భవిష్యత్ తరం ప్రమాదంలో పడి రాజకీయ నాయకులు మనల్ని తొక్కిస్తారంటూ దానికి ప్రతిరూపమే నేడు తెలుగు రాష్ట్రాల్లో దేశమంతా జరుగుతున్న ఎన్నికలు ప్రజల ముందు ఎన్ని రకాల డ్రామాలను ప్రదర్శిస్తున్నారో పసిగట్టండన్నారు.సమాజ సేవ కోసం సంవత్సరాల తరబడి ప్రజాసేవలో నిజాయితీని కనపరుస్తున్న నాయకులే రాజకీయ పదవి దక్కగానే ప్రజలపై ఉగ్రరూపం దాలుస్తున్నారని ఉక్కు పాదం మోపుతున్నారని అత్యంత హీనమైన స్థాయిలో ప్రజలు చీదరించుకునే స్థాయికి చేరువ అవుతున్నారన్నారు.మేధావి వర్గం ఒకవైపు పైసవర్గం ఒకవైపు అధికార వర్గం ఒకవైపు ప్రజాసేవకు కట్టుబడి పని చేస్తున్న వర్గం మరోవైపు ఎన్నికల్లో పోటీ చేస్తుండగా ప్రజలకు సేవ చేయగల సమర్థవంతమైన నాయకులను మాత్రమే ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని ప్రజలకు దక్కవలసిన విలువలను కాపాడుకోండని గంటాపదంగా చెప్పారు.

## కాకతీయ యూనివర్సిటీలో డాక్టర్ కే. మమత పదవీకాలం పొడిగింపు



**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా, అలాగే భూపాలపల్లి, మహబూబాబాద్ పీజీ కాలేజీల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న డాక్టర్ కే. మమత పదవీకాలాన్ని మరో ఒక సంవత్సరం పాటు పొడిగిస్తూ యూనివర్సిటీ పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిపాలనా పనితీరులో చురుకుదనం, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని ఈ పదవీకాలం పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. డాక్టర్ కే. మమత వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ క్యాంపస్ కాలేజీతో పాటు భూపాలపల్లి, మహబూబాబాద్ పీజీ కాలేజీలలో విద్యా, పరిపాలనా కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, అకాడమిక్ కార్యక్రమాల నిర్వహణ, పరీక్షల నిర్వహణలో ఆమె చొరవ ప్రశంసనీయమని సహచర అధ్యాపకులు పేర్కొన్నారు. పదవీకాలం పొడిగింపు సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ మమతను అభినందించారు. ఆమె సేవలు భవిష్యత్తులో కూడా యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యా అభివృద్ధికి మరింత దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే విద్యా రంగంలో నాణ్యతా ప్రమాణాల పెంపు, పరిశోధన కార్యక్రమాల ప్రోత్సాహం, విద్యార్థి కేంద్రిత విధానాల అమలు వంటి అంశాల్లో ఆమె నాయకత్వం యూనివర్సిటీకి ఉపయోగకరంగా ఉంటుందని అకాడమిక్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేవిధంగా చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారితో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఏరియా ఆసుపత్రి, కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రసవాల సంఖ్య చాలా తక్కువగా జరుగుతున్నాయని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా జరగడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ప్రోత్సహించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు,సంబంధిత సూపరింటెండెంట్లు, గైనకాలజిస్టులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆరోగ్య మహిళా క్లినిక్ లో పరీక్షించి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసిన వారికి తగిన ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు యాక్షన్ ప్లాన్ షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ నాన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, ఇప్పటి వరకు నిర్వహించిన క్యాంపుల వివరాలను డిఎంహెచ్వోకు రేపటిలోగా సమర్పించాలని, ఆర్.బి.ఎస్ కే బృందాలు తమ షెడ్యూల్ ప్రకారం స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలలో వైద్య పరీక్షలు నిర్వహించి పూర్తిస్థాయి రిపోర్టును సమర్పించాలన్నారు. 2025 లో జననాలలో అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైన వేలేరు, శాయంపేట లలో అందుకు కారణాలను విశ్లేషించి దానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంటీపి కిట్ ల అమ్మకాలకు సంబంధించి తనిఖీలు ఎక్కువగా నిర్వహించి గైనకాలజిస్టుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా అమ్ముతున్నారా, లేదా డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేయాలన్నారు. జనవరిలో 37 మెడికల్ షాప్స్ ను తనిఖీ చేసి వివిధ నియమాలను ఉల్లంఘించినందుకు గాను పెనాల్టీలను విధించడం ,వాటి లైసెన్సులను సస్పెండ్ చేయడం జరిగిందని హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలియజేశారు. ఎన్.సి.డి స్క్రీనింగ్ తక్కువగా చేయడానికి కారణాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు., టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 1,98,000 మంది వలనరబుల్ జనాభా కి గాను 1,82,359 మందికి పరీక్షలు నిర్వహించినట్లు 1170 కొత్తగా టీబీ కేసులు గుర్తించి నట్లు అలాగే 511 న్యూట్రిషన్ కిట్ లు అందించినట్లు డి.ఎం.హెచ్.ఓ, ప్రోగ్రామ్ అధికారి తెలియజేశారు.ఎస్ ఎన్.సి.యులో అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే అక్కడ మరింత మెరుగైన సేవలు అందించేందుకు కావలసిన ఎక్విప్మెంట్ గురించి డాక్టర్ మానస కలెక్టర్ కు విన్నవించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ. అప్పయ్య, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, జిఎంహెచ్ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ జె కిరణ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ రుబీనా, డాక్టర్ జ్ఞానేశ్వర్, వైద్యాధికారులు, డెమో వి. అశోక్ రెడ్డి, ఎస్ ఓ జి ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు

**రూ.50 వేల లంచం తీసుకుంటూ ఎస్ఐ వినయ్ అరెస్ట్**

**హైద్రాబాద్, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించి, రూ.50 వేల లంచం తీసుకుంటూ ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన ఎస్ఐగా వినయ్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం, ఒక చీటింగ్ కేసులో నిందితుడిని జైలు నుంచి తప్పించేందుకు సహకరిస్తానని చెప్పి ఎస్ఐ వినయ్ బాధితుడిని సంప్రదించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రూ.50 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేశారు. ముందస్తుగా సూచనలు ఇచ్చి బాధితుడిని పంపగా, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వినయ్ లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ బృందం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించి, కేసుకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను సేకరించినట్లు సమాచారం. లంచంగా స్వీకరించిన నగదును స్వాధీనం చేసుకొని, నిందితుడిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన ఎస్ఐను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో కలకలం రేగింది. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన మరోసారి అవినీతి కేసులపై ఏసీబీ దృష్టి మరింత కఠినంగా కొనసాగుతున్నదని స్పష్టమవుతోంది. ప్రజలు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని వారు సూచించారు.

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు..

**కేంద్రం నుంచి కీలక ప్రకటన**

**బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**

**శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి**

**ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు.బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.

## పాకిస్థాన్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం..

**21 ఏళ్ల గరిష్ఠానికి నిరుద్యోగం!**

**ఆర్థిక స్థిరత్వం సాధించామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితి**

**పాక్ పదేళ్లలో 3 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుందన్న ప్రపంచ బ్యాంకు**

**ఉపాధి లేక దేశం విడిచి వెళుతున్న నిపుణులు, డాక్టర్లు**

**ప్రైవేటు రంగం కూడా కుదేలు.. మూతపడుతున్న పరిశ్రమలు**



**పాకిస్తాన్, జై భీమ్ న్యూస్**

పాకిస్థాన్ ప్రభుత్వం తాము దేశంలో ఆర్థిక స్థిరత్వం సాధించామని గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరింది. లక్షలాది మంది పాకిస్థానీలకు ప్రభుత్వం చెబుతున్న 'ఆర్థిక స్థిరత్వం' అనేది ఉపాధినివ్వని ఓ పనికిరాని మాటగానే మిగిలిపోయిందని పాకిస్థానీ మీడియా కథనం ఒకటి వెల్లడించింది. 'ది న్యూస్ ఇంటర్నేషనల్' పత్రిక కథనం ప్రకారం.. 2025 లేబర్ ఫోర్స్ సర్వే భయంకరమైన వాస్తవాలను బయటపెట్టింది. దేశంలో నిరుద్యోగిత రేటు 7.1 శాతానికి పెరిగింది. ఇది గడిచిన 21 ఏళ్లలో అత్యధికం. ఈ గణాంకాలు ప్రభుత్వ విజయవాదానికి కళ్లెం వేస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటనల్లో దీని ప్రస్తావనే లేకుండా పోయింది. ఉద్యోగాలు దొరక్క ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నిత్యావసరాలు తగ్గించుకుంటున్న కుటుంబాలు, అవకాశాల్లేక ఆశలు కోల్పోతున్న యువత రూపంలో ఈ సంక్షోభం ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ రాబోయే పదేళ్లలో 3 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంటుందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా చేసిన హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా దాదాపు 30 లక్షల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్న తరుణంలో వారికి ఉపాధి కల్పించడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారింది. ఈ సంక్షోభానికి నిదర్శనంగా, 2025లో రికార్డు స్థాయిలో దాదాపు 4,000 మంది డాక్టర్లు దేశం విడిచి వెళ్లిపోయారు. వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రత లేకపోవడమే ఇందుకు కారణం. ఉద్యోగాల కల్పన కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడటం కూడా సమస్యను జఠిలం చేస్తోంది. ఫ్యాక్టరీలు మూతపడుతుండటం, తయారీదారులు విదేశాలకు తరలిపోతుండటంతో ఆ రంగం కూడా తీవ్ర ఒత్తిడిలో ఉంది. కేవలం లెక్కల్లో స్థిరత్వం చూపిస్తూ, క్షేత్రస్థాయిలో ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతింటే ఆ స్థిరత్వం వల్ల ప్రయోజనం ఏంటని సదరు కథనం ప్రశ్నించింది.

# మడికొండలో విద్యార్థుల ఆందోళన





**పోలీసుల జోక్యంతో పరిస్థితి ప్రశాంతం**

**మడికొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా మడికొండలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కళాశాలలో మంగళవారం కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కళాశాలకు ఆలస్యంగా వచ్చిన కారణంగా 11 మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి శారీరకంగా దండించారనే ఆరోపణల నేపథ్యంలో విద్యార్థుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటనపై నిరసనగా సుమారు 120 మంది విద్యార్థులు కళాశాల ప్రాంగణం నుండి బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. అనంతరం తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న మడికొండ పోలీసులు, ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ బృందంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు. అలాగే సంబంధిత జోనల్ అధికారులను సంప్రదించి పరిస్థితిని వారికి వివరించారు. అధికారులు కూడా విద్యార్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసులు, అధికారుల చర్చల అనంతరం విద్యార్థులు తిరిగి కళాశాలకు వెళ్లేందుకు అంగీకరించారు. ఈ ఘటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. మడికొండ ఎస్‌హెచ్‌ఓ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా ఉందని, విద్యార్థులు కళాశాలకు తిరిగి వెళ్లారని, ఎలాంటి చట్టవిరుద్ధ సంఘటనలు జరగలేదని తెలిపారు. కొంతసేపు ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ, పోలీసులు మరియు అధికారుల సమన్వయంతో పరిస్థితి అదుపులోకి వచ్చి సాధారణ స్థితి నెలకొంది.

# ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణే లక్ష్యం





**సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంలో ఎస్సై శివకుమార్**
**సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై విద్యార్థులకు విస్తృత అవగాహన సదస్సు**

**హసన్‌పర్తి, ఫిబ్రవరి 10, 2026 (జై భీమ్ న్యూస్)**

ఇంటర్నెట్ వినియోగంలో సరైన అవగాహన కలిగి ఉంటేనే ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ మోసాలు, ఇతర ప్రమాదాల బారిన పడకుండా ఉండగలమని వరంగల్ సైబర్ సెల్ యూనిట్ ఎస్సై శివకుమార్ తెలిపారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ఇంటర్నెట్ వినియోగం ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందని, అయితే దాని వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం (సేఫర్ ఇంటర్నెట్ డే) సందర్భంగా దేవన్నపేటలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో పాఠశాల ప్రిన్సిపాల్ జోష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ సమాజానికి అపారమైన ఉపయోగాలను అందిస్తున్నప్పటికీ అదే సమయంలో అనేక ప్రమాదాలకు కూడా కారణమవుతోందన్నారు. ముఖ్యంగా సైబర్ మోసాలు, ఆర్థిక మోసాలు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం, సోషల్ మీడియా ద్వారా వేధింపులు, లైంగిక దోపిడీ వంటి ఘటనలు పెరుగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా బాలలు, యువత సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో స్నేహాలు చేయకూడదని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, పాస్‌వర్డ్‌లు వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోరాదని సూచించారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే బాధితులుగా మారకుండా ఉండగలమని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాలు లేదా ఆన్‌లైన్ వేధింపులకు గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న సైబర్ సెల్ ఎస్సై చరణ్ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నుండి ఎలా రక్షించుకోవాలి, సురక్షిత పాస్‌వర్డ్‌ల వినియోగం, ఫిషింగ్ లింకులు గుర్తించడం వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్ బత్తుల కరుణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో డిజిటల్ అవగాహన పెంపొందించడం కాలానుగుణ అవసరమని, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగించే అలవాటు చిన్నప్పటి నుంచే పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, ఈసంపల్లి సుదర్శన్, ఎం. అజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయ బృందం, సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు.

# పారా సిట్టింగ్ వాలీబాల్ జాతీయ పోటీలకు తెలంగాణ జట్టు ఎంపిక ట్రయల్స్ విజయవంతం

**హన్మకొండ, ఫిబ్రవరి 10, 2026 (జై భీమ్ న్యూస్)**




పారా సిట్టింగ్ వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేయుటకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపిక ట్రయల్స్ వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ట్రయల్స్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 60 మంది పారా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారుల శారీరక సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, ఆటపై అవగాహన, జట్టు సమన్వయం మరియు క్రమశిక్షణను ప్రమాణాలుగా తీసుకుని నిపుణులైన సెలెక్షన్ కమిటీ తుది జట్టును ఎంపిక చేసింది. ఈ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్--2026లో పాల్గొననున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ నగరంలోని మీరట్ కాలేజీలో ఫిబ్రవరి 25 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పారాలింపిక్ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు, పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు సింగారపు బాబు మాట్లాడుతూ, పారా క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర స్థాయి ట్రయల్స్ నిర్వహించామని, తెలంగాణ జట్టు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు, స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, డిసేబుల్డ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ అజ్మీర రాజు, పారా క్రీడల సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు మరియు క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎంపికైన క్రీడాకారులకు జాతీయ పోటీలకు ముందుగా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హనుమకొండ/పరకాల, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ ఘన్పూర్ మరియు పరకాల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం పరిశీలించారు. స్టేషన్ ఘన్పూర్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన సీపీ, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై పోలీస్ మరియు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌ల భద్రపరచే స్ట్రాంగ్ రూంలను అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌లతో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తూ, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఘన్పూర్ ఏసీపీ భీం శర్మకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పరకాల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పరకాల మండల కేంద్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కూడా సీపీ సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, అడిషనల్ కలెక్టర్ రవితో కలిసి లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పరకాల ఏసీపీ సతీష్ బాబుకు సూచించారు. బుధవారం జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఎన్నికల నియమాలను ఎవరూ ఉల్లంఘించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


## పింగిళి కళాశాలలో ఈ నెల 12, 13 తేదీలలో జాతీయ సదస్సు




**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (ఆటోనమస్)లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12, 13 తేదీలలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. సెమినార్ కన్వీనర్ డా. డి. సురేష్ బాబు మాట్లాడుతూ "సెక్యూరింగ్ ది డిజిటల్ ఫ్యూచర్: సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రైవసీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్" అనే అంశంపై ఈ సదస్సు జరగనున్నదని చెప్పారు. డిజిటల్ యుగంలో ఉన్నత విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సైబర్ ముప్పులు, డేటా గోప్యత సమస్యలు, సమాచారం భద్రత, నైతిక బాధ్యతలపై అవగాహన పెంపొందించడంలో ఈ సదస్సు కీలకంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ జాతీయ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు, ఔత్సాహికులు డిజిటల్ వేదికలను సురక్షితంగా వినియోగించేందుకు అవసరమైన నైపుణ్యాలు, ఉత్తమ ఆచరణలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు బి. స్వర్ణలత, డా. పి. ప్రతిభ, టి. అరుణ, పి. భారతి, ఎం. శ్రీదేవి, కె. సరిత, డి. దివ్య తదితరులు పాల్గొని, జాతీయ సదస్సు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## యోగ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**వరంగల్, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ యోగ సెంటర్, డీన్ స్టూడెంట్ అఫైర్స్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ మరియు వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో యోగ శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయ సోషియాలజీ విభాగం ఓపెన్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని యోగ ఇన్‌స్ట్రక్టర్ భండారు మొగిలయ్య ప్రారంభించారు. శిక్షణలో విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మొత్తం 12 రోజుల పాటు యోగ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలు మరియు ఆరోగ్యానికి ఉపయోగపడే వివిధ యోగ విధానాలపై పాల్గొనేవారికి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# వేసవిలో సూర్యుడి వేడి ప్రభావం

### గొంతు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి హైడ్రేషన్ చాలా అవసరం

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరులో వేసవి వేడి సంవత్సరం సంవత్సరం పెరుగుతున్నందున డీహైడ్రేషన్ సమస్యలు పెరుగుతున్నాయి. శరీరంలో నీటి కొరత ఉన్నప్పుడు, అది బలహీనత లేదా తలనొప్పిని మాత్రమే కాకుండా గొంతు మరియు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. కానీ ఇ ఎన్ టి నిపుణుల అభిప్రాయం ప్రకారం, వేసవిలో గొంతు ఎండిపోవడం, మాట్లాడేటప్పుడు బొంగురుపోవడం మరియు అలసట వంటి కేసులు పెరుగుతున్నాయి. బెంగళూరులో వేసవిలో డీహైడ్రేషన్ సంబంధిత సమస్యల కోసం ఆసుపత్రులను సందర్శించే వారి సంఖ్య పెరుగుతుంది. వేసవి కాలంలో ఒ ఆర్ ఎస్ వాడకం దాదాపు 60శాతం పెరుగుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. అదేవిధంగా, వేడి కాలంలో డీహైడ్రేషన్, జ్వరం మరియు బలహీనత సమస్యల కోసం ఒ పి డి సందర్శనలు దాదాపు 20శాతం పెరుగుతాయి.

బెంగళూరు నగరంలోని వైట్ ఫీల్డ్ మెడికవర్ హాస్పిటల్‌లోని కన్సల్టెంట్ ఇ ఎన్ టి సర్జన్ డాక్టర్ ప్రెస్విట్ రావు తెలిపిన ప్రకారం, “శరీరంలో నీటి కొరత ఉన్నప్పుడు, గొంతు ఎండిపోతుంది మరియు స్వర తంతువులకు అవసరమైన తేమ తగ్గుతుంది. దీని ఫలితంగా మాట్లాడేటప్పుడు బొంగురుపోవడం, గొంతు నొప్పి మరియు అలసట వస్తుంది.” డీహైడ్రేషన్ వల్ల గొంతు పొడిబారడం, తరచుగా గొంతు క్లియర్ కావడం, బొంగురుపోవడం మరియు గొంతు నొప్పి వస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే, ఇది స్వర తంతువుల వాపుకు కూడా దారితీస్తుంది. ఉపాధ్యాయులు, గాయకులు, కాల్ సెంటర్ ఉద్యోగులు మరియు ఎక్కువగా మాట్లాడేవారు బాధపడే అవకాశం ఉంది. పిల్లలు మరియు వృద్ధులు కూడా త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఎసి గదుల్లో ఎక్కువ సమయం గడిపే వారిలో పొడి గొంతు సమస్యలు పెరుగుతాయి. ఎసి తేమను తగ్గిస్తుంది, ఇది గొంతును మరింత ఎండిపోతుంది. ఈ సమస్యలను నివారించడానికి, రోజుకు కనీసం 2.5--3 లీటర్ల నీరు త్రాగాలి. మీరు ఎక్కువగా చెమట పట్టినట్లయితే, మీరు ఒ ఆర్ ఎస్ లేదా ఎలక్ట్రోలైట్ పానీయాలు తాగాలి. మీరు కాఫీ, టీ మరియు శీతల పానీయాల తీసుకోవడం తగ్గించాలి. ఎసి గదిలో నీటి పాత్రను ఉంచడం వల్ల తేమను నిర్వహించడానికి సహాయపడుతుంది. అధిక నీటి శాతం ఉన్న పండ్లు తినడం మరియు గొంతుకు విశ్రాంతి ఇవ్వడం ముఖ్యం. బెంగళూరులో పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల మధ్య, డీహైడ్రేషన్ గొంతు మరియు వాయిస్ సమస్యలకు ప్రధాన కారణం అవుతోంది. సరైన హైడ్రేషన్ నిర్వహించడం వల్ల వేసవిలో గొంతు మరియు వాయిస్ ఆరోగ్యంగా ఉంటాయి.




## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టు ఎంపిక



**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీకి చెందిన మహిళా బ్యాడ్మింటన్ జట్టు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై. వెంకయ్య తెలిపారు. 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ పోటీలు తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11 నుండి 15 వరకు నిర్వహించబడనున్నాయి. ఈ పోటీలలో కాకతీయ యూనివర్సిటీ తరఫున పది మంది విద్యార్థినులు పాల్గొననున్నారు. జట్టులో ఈ. జ్ఞానంకిత, ఎం. నికిత, పి. అమూల్య, ఎ. సంధ్యారాణి, ఎం. శ్రావ్య శ్రీ, ఎం. పరిమళ, జె. ప్రవళిక, ఎం. స్రీజ, ఆర్. శ్రావిక, ఈ. రేణుక ఉన్నారు. వీరు వీసీపీఈ బొల్లికుంట, యూసీపీఈ ఖమ్మం, పింగళి డిగ్రీ కళాశాల, జగృతి మహిళా డిగ్రీ కళాశాల, టీజీటిడబ్ల్యూఆర్‌డీసీ మహబూబాబాద్ తదితర కళాశాలలకు చెందినవారు. ఈ జట్టుకు వీసీపీఈ బొల్లికుంటకు చెందిన శారీరక విద్యా దర్శకుడు కె. శ్రీకాంత్ కోచ్-కమ్-మేనేజర్‌గా వ్యవహరించి జట్టును వెంట తీసుకెళ్తారు. యూనివర్సిటీ తరఫున పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు అధికారులు అభినందనలు తెలుపుతూ, పోటీలలో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జంగా రాఘవరెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు



**వరంగల్, ఫిబ్రవరి 10, 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రసిద్ధ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో మంగళవారం ఉదయం తెలంగాణా రాష్ట్ర సహకార నూనె గింజలు మరియు పెంపకందారుల సమాఖ్య చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయానికి విచ్చేసిన జంగా రాఘవరెడ్డి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ముందుగా ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న ఆదిశంకరాచార్యుల విగ్రహం, వల్లభ గణపతిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ప్రధాన ఆలయంలోకి ప్రవేశించి శ్రీ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహింపజేశారు. పూజా కార్యక్రమంలో భాగంగా అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు, అర్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అనుచరులు కూడా పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు శ్రీ టక్కర్సు సత్యం ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు కలిసి మహదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం సంప్రదాయం ప్రకారం ఆలయ పూజారులు దంపతులకు ఆశీర్వచనాలు అందించి, వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ రామల సునీత మాట్లాడుతూ, భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలు, సేవల వివరాలను కూడా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.


## సెంగోల్ చరిత్ర ఆధారంగా నిఖిల్ ‘స్వయంభూ’

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రం ‘స్వయంభూ’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కథాంశానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని నిఖిల్ పంచుకున్నారు. ఈ సినిమా కథ న్యాయబద్ధమైన పాలనకు ప్రతీకగా నిలిచే ‘సెంగోల్’ (రాజదండం) చారిత్రక నేపథ్యం ఆధారంగా సాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ, “భారత చరిత్రలోని ఓ ప్రత్యేకమైన అంశం అయిన సెంగోల్ చరిత్ర నుంచి స్ఫూర్తి పొంది ‘స్వయంభూ’ కథను రూపొందించాం. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో కనిపించిన సెంగోల్ గురించి అందరికీ తెలుసు. కానీ దాని వెనుక ఘనమైన చరిత్ర ఉంది” అని తెలిపారు. “ఈ సెంగోల్‌ను తొలుత శ్రీరాముడు తన వారసులకు అందించారు. ఇది న్యాయమైన పాలనకు, శక్తికి చిహ్నం. ఆ తర్వాత చోళుల వంటి గొప్ప సామ్రాజ్యాల కాలంలోనూ ఈ సెంగోల్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. మేం ఈ చారిత్రక అంశం చుట్టూ ఒక కల్పిత కథను సృష్టించాం” అని నిఖిల్ వివరించారు. పురాణం, చరిత్ర, కల్పనల మేళవింపుతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. భారతదేశ గొప్ప చరిత్రకు నివాళిగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 11న రెండు నగరాల్లో ఏకకాలంలో పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ‘స్వయంభూ’ చిత్రాన్ని 2026 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో సంయుక్త మీనన్, నబా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

## పాఠశాల బస్సు డ్రైవర్లకు అవగాహన

### డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు

**కాజీపేట, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**




రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు కాజీపేట ట్రాఫిక్ పోలీసులు పలు చర్యలు చేపట్టారు. పాఠశాల బస్సు డ్రైవర్లకు మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ కె. వెంకన్న ఆధ్వర్యంలో తేజస్విని పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అన్నారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన సీఐ వెంకన్న, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం, చట్టపరమైన చర్యలు వంటి అంశాలను వివరించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలను ఉదాహరణగా చూపుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ప్రాణ భద్రత అత్యంత బాధ్యతగా భావించాలని సూచించారు. అదేవిధంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ ట్రాఫిక్, ఏసీపీ ట్రాఫిక్ మార్గదర్శకత్వంలో కాజీపేట ట్రాఫిక్ పోలీసులు అదాలత్ సెంటర్ వద్ద ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వివిధ పాఠశాల బస్సులను ఆపి డ్రైవర్లను పరీక్షించి, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచనలు ఇచ్చారు. విద్యార్థుల రవాణాలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉందని, నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారి తీస్తుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ట్రాఫిక్ అధికారులు తెలిపారు.

## గంజాయి రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష



**హన్మకొండ, 19 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

గంజాయి రవాణా కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ హనుమకొండలోని ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఈ మేరకు ప్రత్యేక సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి బి. అపర్ణాదేవి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 2016 సెప్టెంబర్ 24న కాజీపేట జీఆర్‌పీ పోలీసులు రైల్వే ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతపురం జిల్లా తాడిపల్లి మండలం చిన్నపల్లె గ్రామానికి చెందిన దొందేటి రామాంజనేయులు వద్ద ఉన్న రెండు బ్యాగుల్లో సుమారు 28 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ దయాకర్ కేసు నమోదు చేయగా, సీఐ మధుసూదన్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం సీఐ స్వామి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణలో ప్రస్తుతం సీఐ వి. నరేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ఎం. అభినవ్ మరియు పోలీసు సిబ్బంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్ల రెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణలు రుజువుకావడంతో కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది.

## జంగా రాఘవ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**కాజిపేట, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఆయిల్ ఫెడ్ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జంగా రాఘవ రెడ్డి జన్మదిన వేడుకలు కాజిపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వస్కుల శ్రీను ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో 46వ డివిజన్ మడికొండ గ్రామ నాయకులు, కాజిపేట మండల మహిళా అధ్యక్షురాలు నీలం రజిని వేణు, మాజీ కార్పొరేటర్ తోట్ల రాజు యాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రవిచందర్, భైరి లింగమూర్తి, వస్కుల శంకర్, బిల్లా రవీందర్ పాల్గొన్నారు. అలాగే 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వస్కుల శివ నాగరాజు, మెట్టుగుట్ట డైరెక్టర్ హనుమకొండ మల్లికార్జున్, వస్కుల రాజు, బొజ్జ శ్రీనివాస్, నమ్మిండ్ల రాజు, మైస రామకృష్ణ (ఆర్కే), పసునురి శ్రీనివాస్, నమ్మిండ్ల కృష్ణ, ఆరూరి అఖిల్, ఆరూరి రామకృష్ణ, వస్కుల రవిశేఖర్, వస్కుల యాదగిరి, రసమల్ల నర్సింగ్, వస్కుల శంకర్ తదితరులు హాజరయ్యారు. జంగా రాఘవ రెడ్డి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

## వైస్ ఛాన్సలర్‌తో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు హాజరైన క్యాడెట్లు



**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

న్యూఢిల్లీ లో జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్, ప్రైమ్ మినిస్టర్ ర్యాలీ, గార్డ్స్ ఆఫ్ హానర్ కార్యక్రమాలలో కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన 10 తెలంగాణా బెటాలియన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పరేడ్‌లో మొత్తం ఏడుగురు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొనగా, వారిలో ఆరుగురు ఆర్మీ వింగ్‌కు, ఒకరు ఎయిర్ వింగ్‌కు చెందినవారు. వారు తమ ప్రతిభతో విశేష ప్రశంసలు అందుకున్నారు. కళాశాల సీనియర్ అండర్ ఆఫీసర్ మహమ్మద్ బాబా ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికై, ప్రతిష్ఠాత్మక డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సిసి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అలాగే క్యాడెట్ బి. శ్లేష హస్మిత వర్మ గార్డ్స్ ఆఫ్ హానర్ కార్యక్రమంలో పాల్గొని, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, గౌరవ ప్రధాన మంత్రి, రాష్ట్రపతిని కలవడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. జ్యోతి తెలిపారు. ఈ ఘనత సాధించిన క్యాడెట్లు ఎం.డి. బాబా, పి. శ్రీనాద్, కే. ప్రమోద్, వై. ప్రవీణ్, కే. జైరాం, బి. శ్లేష హస్మిత వర్మలను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్మీ వింగ్ కమాండర్ లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి శాడ్డా, ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి. ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం : డాక్టర్ ఏ. అప్పయ్య

**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను సమన్వయంతో సాధించడంతో పాటు, ఆరోగ్య మహిళ కార్యక్రమంలో రెఫర్ చేయబడిన కేసులకు తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. మంగళవారం ఆయన శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు నిర్వహిస్తున్న ఎనిమిది అంశాల వైద్య పరీక్షలు, మహిళా ఆరోగ్యానికి సంబంధించిన వివిధ విషయాలపై అవగాహన కల్పించే విధానాన్ని ఆయన సమీక్షించారు. అలాగే రెఫర్ చేసిన మహిళలను నిరంతరం ఫాలోఅప్ చేస్తూ వారికి అవసరమైన వైద్య సేవలు అందించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి వివరాలను పరిశీలించిన డీఎంహెచ్ఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన మరమ్మతు పనులను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించడంలో



సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణీ స్త్రీల నమోదు, వారికి నాలుగు సార్లు చెకప్‌లు నిర్వహించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తగిన ఫాలోఅప్ సేవలు అందించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రగతి వివరాలను డీఎంహెచ్ఓకు తెలియజేశారు.

## ప్రభుత్వ న్యాయవాదులకు శుభవార్త

**కేంద్రం ఫీజులు భారీగా పెంపు**

**న్యూ ఢిల్లీ, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



కేంద్ర ప్రభుత్వం తరపున దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో వాదనలు వినిపించే ప్రభుత్వ ప్యానెల్ న్యాయవాదులకు కేంద్ర న్యాయశాఖ శుభవార్త తెలిపింది. సుమారు 11 ఏళ్ల తర్వాత న్యాయవాదుల ఫీజులను గణనీయంగా పెంచుతూ కేంద్ర న్యాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 1, 2026 నుంచి ఈ సవరణ అమల్లోకి వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయం ప్రకారం గ్రూప్-ఏ న్యాయవాదులకు ఒక్క కేసుకు చెల్లించే ఫీజును రూ.13,500 నుంచి రూ.21,600కు పెంచారు. అలాగే గ్రూప్-బీ, గ్రూప్-సీ న్యాయవాదులకు ఒక్క కేసుకు చెల్లించే ఫీజును రూ.9,000 నుంచి రూ.14,400కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ తరపున హైకోర్టులు, జిల్లా కోర్టులు, ట్రైబ్యునల్స్ తదితర న్యాయస్థానాల్లో వాదనలు వినిపించే న్యాయవాదులకు ఈ పెంపు వర్తించనుంది. దీని వల్ల దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రభుత్వ ప్యానెల్ న్యాయవాదులకు ఆర్థికంగా లాభం చేకూరనుంది. న్యాయవాదులు చాలా కాలంగా ఫీజుల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం విశేషంగా భావిస్తున్నారు. న్యాయవాదులపై పెరుగుతున్న పని భారం, న్యాయ ప్రక్రియల్లో పెరుగుతున్న వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఫీజుల పెంపు నిర్ణయం వల్ల న్యాయవాదులకు ప్రోత్సాహం లభించడమే కాకుండా ప్రభుత్వ తరఫున నాణ్యమైన న్యాయసేవలు అందించేందుకు కూడా తోడ్పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. న్యాయవర్గాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాయి.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు - 25 మందికి జైలు శిక్షలు, జరిమానాలు




**వరంగల్, 10 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 25 మందిని కోర్టులో హాజరు పరచగా, పలువురికి జైలు శిక్షలు, జరిమానాలు విధించబడ్డాయి. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో కేసులు నమోదు చేసి, గౌరవ మేజిస్ట్రేట్ రాజ్ నిధి (స్పెషల్ జేఎఫ్‌సీఎం, ××ఐ అదనపు జేఎఫ్‌సీఎం, వరంగల్) ఎదుట నిందితులను హాజరు పరిచారు. విచారణ అనంతరం భూక్య రాములు, పొన్నం రమేష్‌లకు తలో 6 రోజుల జైలు శిక్ష విధించగా, హాంగిరి రాజుకు 4 రోజుల జైలు శిక్ష విధించి హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. కొర్రె రాజ్ కుమార్‌కు రూ.2,500 జరిమానాతో పాటు 3 రోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. మిగతా 21 మందికి కలిపి రూ.23,500 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తికి రూ.1,000 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఈ వివరాలను ట్రాఫిక్ పీఎస్ ఇన్స్పెక్టర్ కె. సుజాత తెలిపారు.

## కొండాపూర్‌లో హైడ్రా కొరడా.. రూ.700 కోట్ల విలువైన భూమికి రక్షణ

**జంగమోని కుంటను మాయం చేసిన కబ్జాదారుల యత్నం భగ్నం**
**4 ఎకరాల చెరువును చదును చేసి ప్లాట్లుగా మార్చేందుకు యత్నం**
**కబ్జాదారులపై కేసులు నమోదు చేసిన రెవెన్యూ అధికారులు**
**చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న హైడ్రా**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో భారీ భూ కబ్జా యత్నాన్ని హైడ్రా అధికారులు అడ్డుకున్నారు. సుమారు రూ. 700 కోట్ల విలువైన 4 ఎకరాల 'జంగమోని కుంట' చెరువు భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడారు. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనగూడ మార్గంలో ఉన్న ఈ చెరువును కబ్జాదారులు పూర్తిగా మట్టితో నింపి చదును చేశారు. చెరువు ఆనవాళ్లు కూడా లేకుండా చేసి, దాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేశారు. ఇటీవల 'జంగమోని కుంట మాయం' అయిందంటూ పత్రికల్లో వచ్చిన కథనాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే స్పందించిన హైడ్రా అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. చెరువును కబ్జా చేసినట్లు నిర్ధారించుకున్న తర్వాత కఠిన చర్యలు చేపట్టారు. భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, చెరువును కాపాడేందుకు హైడ్రా ఆధ్వర్యంలో చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

**రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా వేదనకు గురి చేయడం సరికాదన్న బండి సంజయ్**
**ప్రభుత్వం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన**
**హైదరాబాద్ నడిబొడ్డున ఆందోళన, దీక్ష చేస్తామని హెచ్చరిక**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం సరికాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. పదవీ విరమణ చేసి రెండేళ్లయినా బెనిఫిట్స్ బకాయిలను చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. రిటైర్డ్ అయ్యాక ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మానసిక వేదనకు గురి చేస్తుండటం క్షమించరాని నేరమని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే బెనిఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. తక్షణమే వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేస్తామని అన్నారు.

## మొగిలిచెర్ల గ్రామం వద్ద ఎస్సారెస్పీ కాలువలో న్యాయవాది మృతదేహం గుర్తింపు



**హన్మకొండ, 10 ఫిబ్రవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని మొగిలిచెర్ల గ్రామం సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో ఒక న్యాయవాది మృతదేహం గుర్తించిన సంఘటన మంగళవారం స్థానికంగా కలకలం రేపింది. కాలువలో ఒక మృతదేహం కనిపించినట్లు స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కేయూసీ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం పరీక్ష (పిఎంఈ) పూర్తయిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కేయూసీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ సుంకరి రవి కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని, మరణానికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక మరియు దర్యాప్తు అనంతరం స్పష్టమవుతాయని ఆయన వెల్లడించారు. ఈ సంఘటనతో మొగిలిచెర్ల గ్రామం మరియు పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. మృతుడి వివరాలు, అతను కాలువలోకి ఎలా చేరాడు, ప్రమాదవశాత్తు పడిపోయాడా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. అవసరమైన సాక్ష్యాలను సేకరించి, సంబంధిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ప్రజలు అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం - హక్కుల అమలుపై యూనియన్ వినతిపత్రం



**వరంగల్, ఫిబ్రవరి 10, 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు సామాజిక భద్రతా పథకాల సమర్థవంతమైన అమలును కోరుతూ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్, రైట్స్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ యాజమాన్యానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నెం.60, తేది 11-06-2021 ప్రకారం ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించాల్సిన హక్కులు, వేతనాలు, సౌకర్యాలు, భద్రతా చర్యలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ విద్యా వ్యవస్థ నిరాటంకంగా కొనసాగడంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సేవలు కీలకమైనప్పటికీ, వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా ప్రయోజనాలు సముచితంగా అందడం లేదని పేర్కొన్నారు. యూనియన్ ప్రధాన డిమాండ్లలో కనీస వేతన చట్టం ప్రకారం పూర్తి వేతనం చెల్లించడం, ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు తప్పనిసరిగా అమలు చేయడం, కాజువల్ లీవ్, మెడికల్ లీవ్ తదితర సెలవుల హక్కులు కల్పించడం, ప్రతి ఉద్యోగికి అధికారిక గుర్తింపు కార్డు జారీ చేయడం, ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించడం, సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయడం, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడం, యూనియన్ హక్కులను గుర్తించి కార్మిక చట్టాల ప్రకారం వ్యవహరించడం వంటి అంశాలు ఉన్నాయి. పై డిమాండ్లను విశ్వవిద్యాలయ యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి న్యాయసమ్మతమైన నిర్ణయాలు తీసుకొని తక్షణమే అమలు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలకు పూనుకోవాల్సి వస్తుందని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ ప్రెస్ నోట్‌ను యూనియన్ అధ్యక్షులు సి.హెచ్. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. రత్నాకర్, ఇతర ముఖ్య సభ్యులు విడుదల చేశారు.

## లాభాల హ్యాట్రిక్: వరుసగా మూడో రోజూ లాభాల్లో మార్కెట్లు

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక (క్యు3) ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్లు పెరిగి 25,935 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా, మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా 1 శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఫీ××) కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే, నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 25,550--25,600 స్థాయిల వద్ద ఉంది.

# టీ20 వరల్డ్ కప్: కూనల పోరులో నెదర్లాండ్స్ గెలుపు


**టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో విజయం**
**బంతితో రెండు వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో అజేయంగా 72 పరుగులు చేసిన బాస్ డి లీడ్**
**ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 156/8 స్కోరుకే పరిమితం**
**18 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి రికార్డు విజయాన్ని అందుకున్న డచ్ జట్టు**
**గురువారం డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనున్న నమీబియా**



ఢిల్లీ, జై భీమ్ న్యూస్

టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఆల్‌రౌండర్ బాస్ డి లీడ్ బంతితో, బ్యాట్‌తో చెలరేగడంతో మంగళవారం నాడు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో నమీబియాపై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో డచ్ జట్టు టోర్నీలో బోణీ కొట్టింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా, నెదర్లాండ్స్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేయగలిగింది. జాన్ నికోల్ లాఫ్టీ-ఈటన్ (42) టాప్ స్కోరర్‌గా నిలిచినా, ఇతర బ్యాటర్లు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మార్చడంలో విఫలమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడ్, లోగాన్ వాన్ బీక్ చెరో రెండు వికెట్లు పడగొట్టి నమీబియాను కట్టడి చేశారు. అనంతరం 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్‌ను బాస్ డి లీడ్ ఒంటిచేత్తో గెలిపించాడు. కేవలం 48 బంతుల్లో 5 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కోలిన్ అకెర్‌మాన్ (32)తో కలిసి మూడో వికెట్‌కు 70 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. చివర్లో కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) వేగంగా ఆడటంతో నెదర్లాండ్స్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే, 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో వికెట్ల పరంగా నెదర్లాండ్స్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మరోవైపు, నమీబియా తన తదుపరి మ్యాచ్‌లో గురువారం ఇదే వేదికపై డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనుంది.

# బంగ్లాదేశ్ లో మరో హిందువు దారుణ హత్య



**మైమెన్ సింగ్ జిల్లాలో నిన్న రాత్రి దారుణ హత్య**
**62 ఏళ్ల సుషేన్ చంద్రను హత్య చేసిన దుండగులు**
**పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారన్న పోలీసులు**

బంగ్లాదేశ్, జై భీమ్ న్యస్

బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు ఆగడం లేదు. ఇప్పటికే పలువురు హిందువులను బంగ్లాదేశ్ లో దారుణంగా హతమార్చారు. ఈ నెల 12న బంగ్లాదేశ్ లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో... అక్కడ మరో హిందువును హత్య చేశారు. మైమెన్ సింగ్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. సుషేన్ చంద్ర సర్కార్ (62) అనే వ్యాపారిని ఆయన దుకాణంలోనే హత్య చేశారు. మృతుడు త్రిషల్ సబ్ డిస్ట్రిక్ట్ లోని బోగర్ బజార్ లో బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఈయన ఇదే ప్రాంతంలోని సౌత్ కాండ గ్రామంలో నివసిస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో ఈ హత్య జరిగిందని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారని... ఆ సమయంలో సుషేన్ తన దుకాణంలోనే ఉన్నాడని వెల్లడించారు. హత్య చేసిన తర్వాత హంతకులు షట్టర్ దించి, మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారని తెలిపారు. హంతకుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. హత్యను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ప్రధాని మోదీపై దాడికి ప్లాన్..

## ఆ వీడియో షేర్ చేసిన కిరణ్ రిజిజు

**ఫిబ్రవరి 4 నాటి వీడియోను షేర్ చేసిన కిరణ్ రిజిజు**
**కాంగ్రెస్ మహిళా ఎంపీల ప్రవర్తనను చూసి ఆ పార్టీ నేతలు గర్వపడుతున్నారని ఎద్దేవా**
**ఆరోజు బీజేపీ ఎంపీలు సహనం వహించారన్న కిరణ్ రిజిజు**




ఢిల్లీ, జై భీమ్ న్యూస్

కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ కిరణ్ రిజిజు ఫిబ్రవరి 4న లోక్ సభ లోపల ప్రతిపక్ష ఎంపీలు వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. లోక్ సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు ఇటీవల స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధానిని సభకు రావొద్దని సూచించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రిజిజు తన ఖాతాలో షేర్ చేశారు. ఫిబ్రవరి 4వ తేదీన పార్లమెంటులో కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఈవిధంగా చేసిన ఆందోళనను, వారి అవమానకరమైన ప్రవర్తనను చూసి ఆ పార్టీ నేతలు గర్వపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ సమయంలో బీజేపీ ఎంపీలు ఎంతో సహనంతో ఉన్నారని తెలిపారు. బీజేపీ ఎంపీలు సహనం కోల్పోయి ఉంటే పరిస్థితి చేయిదాటిపోయేదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు గౌరవం, పవిత్రతను కాపాడేందుకు బీజేపీ ఎంపీలు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. కిరణ్ రిజిజు షేర్ చేసిన వీడియోలో కాంగ్రెస్ ఎంపీలు బ్యానర్ పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రధానమంత్రి సీటు వద్ద ఆందోళన చేస్తున్నట్లుగా ఉంది. ఆందోళనను విరమించుకోవాలని కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, గిరిరాజ్ సింగ్‌లు కాంగ్రెస్ మహిళా ఎంపీలను కోరినప్పటికీ వారు అక్కడి నుంచి కదలడానికి నిరాకరిస్తున్నట్లు వీడియోలో ఉంది.

# విశాఖ వాసులకు గుడ్ న్యూస్..

**మెట్రో రైలు ప్రాజెక్టుకు పచ్చజెండా**
**విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం**
**సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్**
**పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ ప్రతిపాదన**





విజయవాడ, జై భీమ్ న్యూస్

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ శుభవార్త అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు ఈ సానుకూల స్పందన లభించడం గమనార్హం. సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఇవాళ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతి ఇస్తున్నట్లు ఖట్టర్ స్వయంగా చంద్రబాబుకు తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో విశాఖ మెట్రో ఏర్పాటులో కీలక ముందడుగు పడినట్లయింది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైల్ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. తాజాగా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో విశాఖ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంతో త్వరలోనే పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడ మెట్రో ప్రతిపాదనపై కూడా త్వరలో స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**కీలక నిర్ణయం తీసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు!**
**ఇకపై డిజిటల్ విధానంలోనే ఎమ్మెల్యేల హాజరు నమోదు చేయాలని నిర్ణయించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**
**వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి మాత్రమే హాజరై, మిగతా సమావేశాలకు దూరంగా ఉంటున్న వైనం**

విజయవాడ, జై భీమ్ న్యూస్

కొందరు సభ్యులు హాజరు రిజిస్టర్‌పై సంతకం చేసి వెంటనే వెళ్లిపోతున్నారని ఆరోపణలు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వైసీపీ ఎమ్మెల్యేల వరుస గైర్హాజరుపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై డిజిటల్ విధానంలోనే ఎమ్మెల్యేల హాజరు నమోదు చేయాలని నిర్ణయించారు. సభకు హాజరుకాకుండా కొందరు సభ్యులు జీతాలు తీసుకోవడం, ఎమ్మెల్యేలుగా కొనసాగడం ఎంత వరకు సబబని స్పీకర్ ఇప్పటికే పలుమార్లు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తనకు ఉన్న విచక్షణాధికారాలతో హాజరు విధానంపై కఠిన నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి ఇప్పటి వరకు వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి మాత్రమే హాజరై, మిగతా సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. వరుసగా 60 రోజుల పాటు శాసనసభ సమావేశాలకు గైర్హాజరైతే అనర్హత వేటు వేయొచ్చని చట్టంలో నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే గవర్నర్ ప్రసంగానికి మాత్రమే హాజరైతే అది సమావేశాలకు హాజరైనట్టు పరిగణనలోకి రాదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో కొందరు సభ్యులు హాజరు రిజిస్టర్‌పై సంతకం చేసి వెంటనే వెళ్లిపోతున్నారని ఆరోపణలు రావడంతో అలాంటి పరిస్థితులకు చెక్ పెట్టేందుకే డిజిటల్ హాజరు విధానాన్ని స్పీకర్ అమలు చేయాలని నిర్ణయించారు. కాగా, ఈరోజు గవర్నర్ ప్రసంగం తర్వాత జరిగే బీఏసీ సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

# హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు**
**కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా**
**అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు**
**రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా**
**జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ.1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్‌ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం..

**ఓటుకు నోటు కేసు డాక్యుమెంట్లపై స్పందించిన డీజీపీ**
**ఈ కేసులో ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు వెల్లడి**
**మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్న డీజీపీ**
**ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి**
**బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన డీజీపీ**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ జరుపుతున్నామని అన్నారు. ఓటుకు నోటు కేసులో కీలకమైన ఫైల్స్ తగలబడిపోయాయనే ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. 2015 నాటి ఈ కేసులో ఆధారాలను 2021లోనే కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ అన్నీ పరిశీలించాకే నివేదికలు ఇచ్చామని అన్నారు. రేపు తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని డీజీపీ వెల్లడించారు. బందోబస్తు కోసం ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను రప్పించామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 1,183 లైసెన్స్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని... 4,318 మందిని బైండోవర్ చేశామని, 398 మందికి నాన్-బెయిల్ వారెంట్లు జారీ చేశామని వెల్లడించారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 55 చెక్ పోస్టులు ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని డీజీపీ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. 181 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశామని అన్నారు. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా



## తమిళ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఆర్కే సెల్వమణి ఎన్నిక

**దర్శకుల సంఘం అధ్యక్షుడిగా సెల్వమణి ఏకగ్రీవంగా ఎన్నిక**
**ఉపాధ్యక్షులుగా కేఎస్ రవికుమార్, పి. వాసు ఎన్నిక**
**ఇంతకు ముందు సంఘానికి సెక్రటరీగా ఉన్న సెల్వమణి**

తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా సీనియర్ దర్శకుడు ఆర్కే సెల్వమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెల్వమణి... మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా భర్త అనే విషయం తెలిసిందే. సంఘం ఉపాధ్యక్షులుగా కేఎస్ రవికుమార్, పి.వాసు, కార్యదర్శిగా ఆర్వీ ఉదయకుమార్, కోశాధికారిగా పేరరసు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదు జాయింట్ సెక్రటరీ, 17 కార్యవర్గ సభ్యుల పదవులకు ఈనెల 15న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ న్యాయమూర్తి తర్వీశ్ వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల్లో 1,800 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇంతకు ముందు ఆర్కే సెల్వమణి తమిళ దర్శకుల సంఘానికి సెక్రటరీగా పని చేశారు. ఇప్పుడు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఐశ్వర్య రాజేశ్ ఓటీటీ సినిమాల్లో క్రేజ్ తగ్గని క్రైమ్ థ్రిల్లర్!



అటు తమిళంలోను .. ఇటు తెలుగులోను ఐశ్వర్య రాజేశ్ కి మంచి క్రేజ్ ఉంది. ఓటీటీలలో ఐశ్వర్య రాజేశ్ సినిమాలను మళ్లీ మళ్లీ చూసేవారున్నారు. ఆమె ఎంచుకున్న కథలు .. పాత్రలు .. ఆ పాత్రలలో ఆమె జీవించే విధానమే అందుకు కారణమని చెప్పుకోవాలి. అలా ఆమె చేసిన సినిమాలలో ఓటీటీ వైపు నుంచి ఎక్కువ ఆదరణ పొందినవిగా ఫర్హానా .. డ్రైవర్ జమున .. సొపన సుందరి .. రన్ బేబీ రన్ కనిపిస్తాయి. అయితే వాటి సరసనే కనిపించే మరో సినిమాగా 'థిట్టమ్ ఇరాండు' గురించి చెప్పుకోవచ్చు. 'థిట్టమ్ ఇరాండు' అంటే రెండో వ్యూహం అనే అర్థం ఉంది. అందువల్ల 'ప్లాన్ బి' అనే టైటిల్ తోను ఈ సినిమా ఓటీటీలో కనిపిస్తోంది. తెలుగులోనూ అందుబాటులో ఉంది. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా ఐశ్వర్య రాజేశ్ కనిపిస్తుంది. 2021లో రూపొందిన ఈ సినిమాను, క్రైమ్ థ్రిల్లర్ లను ఇష్టపడేవారు ఓటీటీలో సెర్చ్ చేసి మరీ చూడొచ్చు. కథలోకి వెళితే .. పోలీస్ ఆఫీసర్ 'అధీర' కొత్తగా ఆ సిరీకి వస్తుంది. డ్యూటీలో చేరిన తొలి రోజులలోనే, ఆమె చిన్ననాటి స్నేహితురాలు దీపాసూర్య అదృశ్యమవుతుంది. ఆ తరువాత కాలిపోయిన ఒక కారులో ఆమె మృతదేహం దొరుకుతుంది. ఆమె భర్త కిశోర్ తమకి శత్రువులెవరూ లేరని అధీరాతో చెబుతాడు. ఈ మిస్టరీని అధీరా ఎలా ఛేదిస్తుంది? అనేది కథ. ఆడియన్స్ గెస్ చేయని ట్విస్ట్ తో సాగే ఈ సినిమాను ఒకసారి ట్రై చేయవచ్చు.



## ఖుషీ అవుతున్న కీర్తి సురేశ్ ఫ్యాన్స్!

**'దసరా' తరువాత హిట్ లేని కీర్తి**
**తమిళ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్**
**'రౌడీ జనార్దన'తో తెలుగులోనూ సందడి**
**సరైన జోడి కుదిరిందంటున్న ఫ్యాన్స్**

హీరోయిన్ గా ఛాన్స్ రావడమే కష్టం .. ఇక ఆ సినిమా హిట్ కొట్టేసి స్టార్ డమ్ దక్కడం మరింత కష్టం. అయితే ఈ విషయంలో కీర్తి సురేశ్ పెద్దగా కష్టపడలేదు. చాలా తేలికగా ఆమె వరుస విజయాలను అందుకుంటూ వెళ్లింది. స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పడం మొదలుపెట్టేసింది. అయితే మొదటి నుంచి కూడా ఆమె తమిళ సినిమాలకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం మనకి కనిపిస్తుంది. ఈ కారణంగా తెలుగు ప్రాజెక్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కీర్తి సురేశ్ ప్లానింగ్ కారణంగా తెలుగులో గ్యాప్ లేకుండా చేయలేకపోయింది. 'దసరా' తరువాత ఆమె తెలుగులో పెద్దగా సినిమాలు చేయలేకపోయింది. తమిళంలో మాత్రం ఆమె మార్కెట్ బాగానే ఉంది. తెలుగులో ఆమె ప్రాజెక్టులు .. నిర్ణయాల విషయంలో అభిమానులు మాత్రం కాస్త అసంతృప్తిగానే ఉన్నారు. ఆమె నుంచి సరైన సినిమా రాలేదనే అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె విజయ్ దేవరకొండ జోడిగా 'రౌడీ జనార్దన' సినిమాను ఒప్పేసుకుంది. విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేశ్ తొలిసారిగా చేస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్టుకి ఒక్కసారిగా బజ్ వచ్చేసింది. తెరపై ఈ జోడీ చాలా బావుంటుందని ఫ్యాన్స్ అంటున్నారు. అటు విజయ్ దేవరకొండకి .. ఇటు కీర్తి సురేశ్ కి కూడా ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇక ఈ సినిమాలో రాజశేఖర్ ఓ కీలకమైన పాత్రను చేయనున్నారని అంటున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా, డిసెంబర్లో థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM